క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

మోతె : మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ ముప్పాని ఆశా అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరు కావాలని కోరారు.

23న గురుకుల ప్రవేశ పరీక్ష

నడిగూడెం : 2023– 24 విద్యా సంవత్సరానికి గాను మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఈ నెల 23న 5వ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్.ధనవిజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించనున్నట్లు, విద్యార్థులు ఉదయం 10 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు.

విద్యార్థికి డీఎస్పీ అభినందన



అక్షయ్‌రెడ్డిని అభినందిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి, సీఐ

కోదాడ : జాతీయస్థాయిలో జరిగిన ఐఎన్‌టీఎస్ఓ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ చూపి ల్యాప్‌టాప్ గెలుచుకున్న కాకుమాను అక్షయ్‌రెడ్డిని గురువారం డీఎస్పీ కార్యాలయంలో కోదాడ డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి, సీఐ ఆంజనేయులు ప్రత్యేకంగా అభినందించారు. ఇదే పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులు కేశవ్, షేక్ సైఫా, షేక్ అజ్మీర్‌లు ట్యాబ్‌లు గెలుచుకోగా వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో ఉపాధ్యాయులు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో కోదాడ చైతన్య పాఠశాల నిర్వాహకులు, డాక్టర్ శ్రీపతిరెడ్డి, డాక్టర్ సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయ భూముల కౌలు వేలం

మునగాల : మండలంలోని మాధవరం గ్రామంలో గల శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయానికి చెందిన వ్యవసాయ భూముల కౌలుకు సంబంధించి శుక్రవారం దేవాలయ ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ టీవీ చలపతి తెలిపారు. సర్వే నెం.45లో గల 36 ఎకరాల 17 కుంటల భూమికి సంబంధించి కౌలు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనే రైతులు ముందుగా రూ.10,000ల డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. వేలంపాటను ఏ కారణం చేతనైనా రద్దు చేసే అధికారం దేవాదాయ శాఖకు ఉంటుందని, ఆసక్తి గల రైతులు వేలంపాటకు హాజరుకావచ్చని తెలిపారు.

ఏఎంసీ చైర్‌పర్సన్ లక్ష్మమ్మకు సన్మానం



ఏఎంసీ చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న బీసీ సంఘం నాయకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్‌పర్సన్ దొంతగాని లక్ష్మమ్మను గురువారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలమాల, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బి.గోవిందరావు, జి.దీప, జి.అనిత, డి.శ్రీనివాస్, జి.రాంబాబు, జె.శ్రీనివాస్, నరసింహచారి, ఆర్.వెంకటేశ్వర్లు, డి.రామరాజు, కోటమ్మ, రాజ్యలక్ష్మి, అర్చన, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' ప్రారంభం



నారాయణపురంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ శంకర్

చిలుకూరు : మండలంలోని నారాయణపురం గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని గురువారం సర్పంచ్ తమ్మునబోయిన శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కంటి వెలుగు శిబిరం ప్రదేశంలో చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యదర్శి సారిక, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ బహుమతులు అందజేత

హుజూర్‌నగర్ : పట్టణంలోని గ్రీన్‌వుడ్ కృష్ణవేణి పాఠశాలలో పనిచేస్తున్న ముస్లిం ఉపాధ్యాయులకు ఆ పాఠశాల చైర్మన్ సరిత మరెడ్డి గురువారం రంజాన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కృష్ణారావు, హెచ్ఎం రాజారెడ్డి, దిల్షాద్, నజీమా, రెహమత్, అమీనా, సనా తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా 'ఉపాధి' పనులు

- రోజుకు రెండు వేల మంది హాజరు
- మండల వ్యాప్తంగా 550కి పైగా పనుల గుర్తింపు
- పని ప్రదేశాల్లో సౌకర్యాల కల్పన
- ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్న అధికారులు



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న అధికారులు

చిలుకూరు : మండలంలో జాతీయ ఉపాధి హామీ పనులు గత పది రోజులుగా ముమ్మరంగా సాగుతున్నాయి. పూర్తిగా ఆయకట్టు మండలం కావడంతో ప్రతి ఏడాది వ్యవసాయ పనులు పూర్తైన తరువాత ఏప్రిల్ నెలలో సగం, మే, జూన్, జూలై నెలలో అధికారులు ఉపాధి హామీ పనులు పెడతారు. ఈమేరకు ఈ ఏడాది కూడా సంబంధిత అధికారులు ముందస్తుగా గ్రామాల్లో పనులు గుర్తించి ప్రారంభించారు. అయితే ఆయకట్టు మండలం కావడంతో నాట్లు వేసిన సమయంలో ఒక రకమైన పనులు, వ్యవసాయ పనులు పూర్తయిన తరువాత మరో రకమైన పనులను కూలీలకు అధికారులు కల్పిస్తున్నారు. ప్రతి కుటుంబానికి 100 రోజులు పని దినాలు కల్పించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

నాలుగు నెలల పాటు పనులు..

కాగా, గ్రామాల్లో కూలీలకు నాలుగు నెలల పాటు ఉపాధి హామీ పనులు కల్పించేందుకు సంబంధిత అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రస్తుతం గ్రామాల్లో కంపచెట్లు తొలగించడం, రోడ్డు మరమ్మతుల పనులు, కాలువల పూడికతీత పనులు, పంట కాలువల పూడికతీత పనులు చేయిస్తున్నారు. అదేవిధంగా నాడేప్ కాంపోస్టు పనులు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు, ఇంకుడు గుంతలు తదితర పనులు కల్పిస్తున్నారు. మండల వ్యాప్తంగా గ్రామాల్లో 550కు పనులు గుర్తించారు. సుమారుగా రూ.2 కోట్ల వరకు పనులు కల్పించే లక్ష్యంగా పెట్టుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో రోజుకు సగటున రెండు వేల మంది వరకు కూలీలు పనులు చేస్తున్నారు. జాతరను తలపించే విధంగా పనులు జరుగుతున్నాయి. పనులు జరిగే చోట అధికారులు కనీస సౌకర్యాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఎండలు మండిపోతున్నందున పనులు జరిగే చోట షామియాలు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు.

వంద రోజుల పని కల్పిస్తాం



మండలంలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే పనులకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేశాం. ఆ ప్రకారం పనులు చేయిస్తున్నాం. నిబంధనల ప్రకారం ప్రతి కుటుంబానికి 100 రోజులు పని దినాలు కల్పించేలా చూస్తాం. కూలీలకు పనికి తగిన వేతనం అందేలా చర్యలు తీసుకుంటాం. ఎప్పటికప్పుడు పనులు జరిగే ప్రదేశాలను తనిఖీ చేస్తున్నాం.

– నిర్మల, ఏపీఓ, చిలుకూరు

గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలి



గరిడేపల్లి : సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుజాత



హుజూర్‌నగర్ : చింతలపాలెంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరెడ్డి

గరిడేపల్లి : వేసవి కాలం పూర్తయ్యేవరకు మండలంలో నీటి ఎద్దడి లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాని ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశంలో జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. గారకుంటతండా వద్ద బ్రిడ్జి కొతకు గురై ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ పాకాల పరమేష్ సమావేశం దృష్టికి తీసుకురాగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఏఈ కుర్మయ్య తెలిపారు. అలాగే అబ్బిరెడ్డిగూడెం-సర్వారం రోడ్డు గుంతలమయంగా మారిందని, అదేవిధంగా గ్రామాల్లో కుక్కల బెడదను నియంత్రించాలని సర్వారం ఎంపీటీసీ బారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కట్టవారిగూడెం తారు రోడ్డు మరమ్మతు పనులను పూర్తి చేయాలని ఆ గ్రామ సర్పంచ్ అపర్ణ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీడీఓ వనజ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనుల వద్ద తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్థానిక ఎమ్మెల్యే సైదిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. ఎంపీడీఓ వనజ, ఎంపీఓ మహేష్, ఏఓ ప్రియతమ్‌కుమార్, ఏపీఎం శ్రీనివాస్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

హరితహారం మొక్కలు ఎండిపోకుండా చూడాలి

హుజూర్‌నగర్ : గ్రామాలలో నీటి ఎద్దడి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కె.వెంకటరెడ్డి అన్నారు. గురువారం చింతలపాలెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలకు రోజుకు 50 మందికి చొప్పున పని కల్పించాలని చెప్పారు. హరితహారం మొక్కలు ఎండిపోకుండా నీటిని అందిస్తూ కాపాడాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.600 కూలి చెల్లించాలి

నడిగూడెం : జాతీయ ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు రోజుకు రూ.600లు కూలి చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని చాకిరాలలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి మాట్లాడారు. పనుల వద్ద మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కళింగరావు, ముత్యాలు, లక్ష్మి, జయమ్మ, మణికుమారి, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న మసీదు కమిటీ సభ్యులు

నడిగూడెం : మండల కేంద్రంలోని పాత మసీదులో గురువారం రంజాన్ పండుగను పురస్కరించుకొని ప్రభుత్వం నుంచి మంజూరైన రంజాన్ తోఫాను మసీదు కమిటీ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మసీదు కమిటీ సదర్ షేక్.లతీఫ్‌బాబు, ప్రధాన కార్యదర్శి జానిమియా, మైనార్టీ జిల్లా నాయకుడు ఖలీల్ అహ్మద్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.జలీల్, షేక్.ఇబ్రహీం, మౌలానా, రమీజ్, మహ్మద్ మహిమూద్, రఫీ, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేత



బస్సుపాస్‌లు అందజేస్తున్న సర్పంచ్, అధికారులు

చిలుకూరు : మండలంలోని ఆర్లెగూడెం గ్రామంలో గురువారం దివ్యాంగులకు రాయితీపై బస్‌పాస్‌లను సర్పంచ్ మామిడి నాగమణి చినరాములు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి సౌమ్య, కన్నెకంటి శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం సెక్టార్‌లోని దొండపాడులో గల 5వ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల అభివృద్ధి పరిశీలన నివేదిక కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అన్నపురెడ్డి పద్మ, వార్డు సభ్యురాలు పద్మ, సంఘ బంధం అధ్యక్షురాలు లక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీను, సైదులు, అంగన్‌వాడీ టీచర్, ఆయా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోచింగ్‌ల పేరుతో అధిక ఫీజులు వసూలు

కోదాడఅర్బన్ : ఎంసెట్, నీట్, ఇతర ఎంట్రెన్స్‌లకు కోచింగ్‌ల పేరిట అధిక ఫీసులు వసూలు చేస్తున్న విద్యా సంస్థలపై, కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎం.చందర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కోదాడలో జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఎంసెట్, నీట్ తదితర కోచింగ్‌ల పేరుతో అధిక కోచింగ్ సెంటర్లు వెలిశాయని, అదేవిధంగా కళాశాలల్లో కూడా ప్రత్యేకంగా కోచింగ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థుల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. కాగా నిబంధనలకు విరుద్ధంగా విద్య సంవత్సరం ప్రారంభం కాకముందే డొనేషన్ల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని, అడ్మిషన్స్ ప్రక్రియ ప్రారంభించారన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు సంతోష్, కల్యాణ్, నందు, శ్రావణ్, గోపి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మేళ్లచెరువు వైద్యాధికారి మృతి



డాక్టర్ ప్రేమ్‌సింగ్ (ఫైల్)

హుజూర్‌నగర్: మేళ్లచెరువు మండల వైద్యాధికారి డాక్టర్ ప్రేమ్‌సింగ్ అనారోగ్యంతో గురువారం హుజూర్‌నగర్‌లో మృతిచెందారు. గత రెండు రోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆయనకు గురువారం తెల్లవారుజామున ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, డాక్టర్లు చికిత్స చేస్తుండగానే ఆయన మృతిచెందారు. విషయం తెలుసుకున్న నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి వేర్వేరుగా హుజూర్‌నగర్‌లోని మృతుడి ఇంట్లో మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో డిప్యూటీ డీఎంహెచ్ఓ నిరంజన్, ఎంపీపీలు కోట్టె పద్మ సైదేశ్వరరావు, గూడెపు శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ జె. నాగేశ్వరరావు, తహసీల్దార్ దామోదర్‌రావు, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది నివాళులర్పించారు.

డాక్టర్ ప్రేమ్‌సింగ్ మృతికి సంతాపం

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా పనిచేస్తున్న డాక్టర్ ప్రేమ్ సింగ్ గుండెపోటుతో గురువారం తెల్లవారుజామున హుజూర్‌నగర్‌లో మృతి చెందారు. దీంతో ఆయన మృతి పట్ల ఆరోగ్య సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రేమ్‌సింగ్ దశాబ్దకాలంగా ఇక్కడ సేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందారన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



హుజూర్‌నగర్ : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : మండలంలోని ఎత్తిపోతల పథకాల నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వమే తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఉస్తెల సృజన అన్నారు. మండలంలో ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ వాజీద్‌అలీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని కృష్ణా నదిపై నిర్మించిన ఎత్తిపోతల పథకాల నిర్వహణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వమే తీసుకోవాలన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. అర్హత కలిగిన వారికి పెన్షన్‌లు, రేషన్ కార్డులు, డీ ఫారెస్ట్, పోడు భూములకు పట్టాలు అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉస్తెల నారాయణరెడ్డి, మండల కార్యదర్శి చింతిరాల రవి, నాయకులు డి.అంకరాజు, ఇమాంబీ, వీరబాబు, సైదులు, రామారావు, కృష్ణ పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు త్వరితగతిన పంపిణీ చేయాలి

మేళ్లచెరువు : మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గురువారం సీపీఐ నాయకులు తహసీల్దార్ దామోదర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కందిబండ, హేమ్లాతండా గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను లబ్ధిదారులకు త్వరితగతిన పంపిణీ చేయాలని కోరారు. ఎస్సీ హాస్టల్ భవనం నిర్మించాలని, అర్హులైన వారికి రేషన్ కార్డులు, పెన్షన్ అందించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సృజన, మండల కార్యదర్శి పాపిరెడ్డి, సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, యలమంద, మల్లయ్య, శంకర్, కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు



ప్రభుత్వ వైద్యశాలలో పండ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సైదేశ్వరరావు

కోదాడరూరల్ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ముత్తినేని సైదేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం కోదాడ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ప్రభుత్వ వైద్యశాలలో పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సైదేశ్వరరావు మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు విజన్ ఉన్న నాయకుడని, ముందుచూపుతో ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన కలవాడని అన్నారు. టీడీపీ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. నియోజకవర్గంలో పార్టీకి పునర్ వైభవం తెచ్చేందుకు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉప్పగండ్ల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పిడతల శ్రీనివాసరావు, మండల కన్వీనర్ శోభన్, చిలుకూరు, అనంతగిరి కన్వీనర్‌లు కొండా సోమయ్య, చాపల శ్రీను, కౌన్సిలర్ సామినేని నరేష్, ఉన్నం హనుమంతరావు, గణేష్, థామస్, వెంకటనర్సయ్య, రేవంత్‌రెడ్డి తదితరులున్నారు.

సమన్వయంతో గ్రామాలు అభివృద్ధి

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



కోదాడఅర్బన్ : ముస్లింలకు రంజాన్ తోఫా అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



కోదాడరూరల్ : మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

కోదాడరూరల్ : గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాయలంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేసవి కాలంలో గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రజలకు తాగునీరు అందేవిధంగా చూడాలని ఆదేశించారు. హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు ఎండిపోకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులు ధాన్యం అమ్ముకునేందుకు అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కాగా మండలంలో పలు శాఖల్లో పని చేస్తున్న సగానికి పైగా అధికారులు ఈ సమావేశానికి గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ చింత కవితారాధారెడ్డి, వైస్ ఎంపీపీ మల్లెల రాణి, ఎంపీడీఓ విజయశ్రీ, పీఏసీఎస్ చైర్మన్‌లు నల జాల శ్రీనివాసరావు, ముత్తవరపు రమేష్, పశువైద్యాధికారి డాక్టర్ నాగేంద్రబాబు, ఏఓ రజిని, ఆర్ఐ వెంకటనగేష్, రవి, సత్యనారాయణ పాల్గొన్నారు.

హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీక రంజాన్

కోదాడ : హిందూ, ముస్లింల ఐక్యతకు రంజాన్ మాసం ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. గురువారం కోదాడలోని గుడుగుంట్ల అప్పయ్య ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వం ముస్లింలకు ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్డీఓ కిశోర్ కుమార్, తహసీల్దార్ శ్రీనివాసశర్మ, ముస్లిం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవతోనే ప్రజల్లో గుర్తింపు

కోదాడఅర్బన్ : సమాజ సేవతోనే ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని, నిరుపేదల కోసం గఫూర్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. గురువారం కోదాడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రంజాన్ పండుగ సందర్భంగా పట్టణానికి చెందిన గఫూర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.13 లక్షల విలువ గల రంజాన్ తోఫాను ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గఫూర్ మేస్త్రితో కలిసి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఇమామ్‌లకు, మౌజాన్‌లకు, పేద ముస్లింలకు, వృద్ధులకు, వికలాంగులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.శ్రీనివాసశర్మ, మైనార్టీ నాయకులు ఎస్‌కే నయీం, అఫ్జల్, సాధిక్, ఖాదర్, మాజీ సర్పంచ్ పి.సత్యబాబు, మధు, మహిమూద్, అబ్బు, సద్దాం, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సర్వమత సంప్రదాయాలకు ప్రాధాన్యం

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



హుజూర్‌నగర్ : చింతలపాలెంలో రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : సర్వమత సంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. గురువారం చింతలపాలెంలో మేళ్లచెరువు, మఠంపల్లి, చింతలపాలెం మండలాలకు చెందిన పేద ముస్లింలకు ప్రభుత్వం ఇచ్చిన రంజాన్ తోఫాను పంపిణీ చేసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ అన్ని మతాల వారికి ప్రాధాన్యం ఇస్తూ వారి అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వాజీద్‌అలీ, ఎంపీటీసీ చింతారెడ్డి సైదిరెడ్డి, నాయకులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

గరిడేపల్లి : మండలంలోని గానుగుబండ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గుర్రం వెంకటరెడ్డి తండ్రి గుర్రం సీతారాంరెడ్డి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి గురువారం సీతారాంరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకటరెడ్డి, దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ పంగ వీరస్వామి, కొత్త సతీష్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



పోలేనిగూడెంలో దగ్ధమైన వరి పొలాన్ని పరిశీలిస్తున్న బెజవాడ వెంకటేశ్వర్లు, నాయకులు

చిలుకూరు : షార్ట్ సర్క్యూట్‌తో వరి పొలం దగ్ధమై నష్టపోయిన రైతు కుటుంబానికి ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని పోలేనిగూడెంలో షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన వరి పొలాన్ని గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. అధికారులు తక్షణమే స్పందించి రామినేని వీరబాబు పొలం పరిశీలించి తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ అధికారుల తప్పిందం వల్లనే ప్రమాదం జరిగిందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, బాదె నర్సయ్య, తాళ్లూరి పెద మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

భోజనం ఏర్పాటు అభినందనీయం



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు

కోదాడ : పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లుట్ల శ్రీనివాస్ మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు అన్నారు. కోదాడ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులకు కొద్దిరోజులుగా పిల్లుట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న మధ్యాహ్న భోజన కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొని విద్యార్థులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస్‌ను స్ఫూర్తిగా తీసుకొని మరికొంత మంది తెలంగాణలో పేద యువతకు భోజన సౌకర్యం కల్పించి అండగా నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పిల్లుట్ల శ్రీనివాస్, నెమ్మాది సురేష్, మంజుల, షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో 'సుగుణ' ప్రతిభ

కోదాడఅర్బన్ : డిగ్రీ ఫస్ట్ సెమిస్టర్ ఫలితాలలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ స్థాయిలో అత్యధిక ఎస్‌జీపీఏ సాధించిన సుగుణ డిగ్రీ కళాశాల విద్యార్థులను గురువారం కళాశాలలో యాజమాన్యం అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఎం వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ సీహెచ్ సుగుణకుమారి మాట్లాడుతూ తమ విద్య సంస్థలో విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ, నైపుణ్యంతో కూడిన విద్య అందిస్తున్నామన్నారు. కళాశాల విద్యార్థులు బి.ధనలక్ష్మి, ఎస్.వి జయలక్ష్మి, వి.నవ్య, బి.దివ్యలు (9.84)లు సాధించారని తెలిపారు. అనేక మంది విద్యార్థినులు 9.0 జీపీఏ పైనా మార్కులు సాధించారన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

సూర్యాపేట : సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట షీ టీమ్ ఏఎస్ఐ పాండు నాయక్ అన్నారు. సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, మహిళలు, పిల్లల భద్రత గురించి గురువారం సూర్యాపేటలోని చందనా గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్‌లో షీ టీమ్స్ పోలీస్ కళాబృందం ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చందనా నర్సింగ్ కాలేజీ చైర్మన్ ఉషాశ్రీ, షీ టీం సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ జాఫర్, ఎల్లారెడ్డి, శివరాం, మహిళా కానిస్టేబుల్ సాయిజ్యోతి ఉన్నారు.

పిచ్చమ్మ ఆశయ సాధనకు ఉద్యమించాలి



మారోజు పిచ్చమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గన్నా చంద్రశేఖర్, నాయకులు

గరిడేపల్లి : స్వాతంత్ర్య సమరయోధురాలు మారోజు పిచ్చమ్మ ఆశయ సాధనకు కమ్యూనిస్టులు ఉద్యమించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని పొనుగోడులో నిర్వహించిన మారోజు పిచ్చమ్మ ప్రథమ వర్ధంతి సభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో మిలిటెంట్ కార్యకర్తగా అజ్ఞాత జీవితం గడిపిన మారోజు సత్యనారాయణకు ఆయన భార్య పిచ్చమ్మ చేదోడు, వాదోడుగా ఉంటూ ఉద్యమానికి అన్ని విధాలుగా సహకరించారని తెలిపారు. కార్యక్రమంలో సూర్యాపేట మున్సిపల్ మాజీ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కంబాల శ్రీనివాస్, న్యాయమూర్తి గ్రంధి గోపాల కృష్ణమూర్తి, లారీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామినేని శ్రీనివాస్‌రావు, సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు, త్రిపురం సుధాకర్‌రెడ్డి, బిల్ల కనకయ్య, యడ్ల అంజిరెడ్డి, తిరుపతయ్య, లింగయ్య, ఆంజనేయులు, పుల్లమ్మ, అజయ్ తదితరులున్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడంలో ప్రభుత్వం కాలయాపన

హుజూర్‌నగర్ : పట్టణ పరిధిలోని ఫణిగిరి గుట్ట వద్ద అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి పేదలకు పంచాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ కోరారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎనిమిదేళ్లుగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకుండా కాలయాపన చేయడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా యాలాల్ల్వల రాములు, రమణ, మంగయ్య పాల్గొన్నారు.